# ఒకటీ ఒంటరి అంకె

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



*1978 లో మల్లాది గారి కలం నుంచీ వెలువడిన నవల*

(క్రిందటి సంచిక నుంచీ తరువాయి..)

3

త్రిపురం గదిలో చీరకట్టుకుంటుంటే అక్కయ్య మాటలు వినబడ్డాయి. గబగబా బట్టలు కట్టుకుని బయటకు వచ్చింది.

బయట ఆటో ఆగి ఉంది. బావగారు సూట్ కేసులు లోపలికి తీసుకువస్తున్నారు. సునీత వర్ధనమ్మతో మాట్లాడుతోంది.

"హలో అక్కయ్యా" పలకరించింది త్రిపుర.

"కాలేజీకి తయారవుతున్నావా?" అడిగింది సునీత.

"ఔను. ఫలానా రోజు వస్తున్నట్లుగా ముందే వ్రాస్తే స్టేషన్‌కి వచ్చేవాళ్ళం కదా!"

"అనుకోకుండా బయలుదేరాం."

"ఎలా ఉన్నాడు బాబు?"

అక్క చేతిలోని బాబుని అందుకుంది త్రిపురం. సంవత్సరన్నర వాడికి. కేరుమన్నాడు వెంటనే.

"కొత్త" అన్నది సునీత బాబుని తీసుకుని నవ్వి.

"హలో బావగారు" విష్ చేసింది త్రిపురం ఆయన లోపలికి రాగానే.

"హలో. హౌ ఆర్ యు ప్రోగ్రెసింగ్ విత్ యువర్ స్టడీస్?" అడిగాడు ఆయన.

"ఫైన్"

"ఏ ఫేకల్టీ?"

"ఆర్ట్స్"

"ఏడోనెల వచ్చిందా?" అడిగింది వర్ధనమ్మ.

తల ఊపింది సునీత.

"ముందుగా టెలిగ్రాం ఇస్తే స్టేషన్ కి వచ్చేవాళ్ళం. అయినా ఉత్తరం రాసి పడేస్తే నేనే వచ్చి తీసుకువచ్చేదాన్నిగా" అన్నది వర్ధనమ్మ.

జడవేసుకుంటూ త్రిపురం వాళ్ళ సంభాషణ వింటూండిపోయింది.

"కాలేజీకి ఇవాళ వెళుతున్నావా? లేకపోతే మానేస్తావా?" అడిగింది వర్ధనమ్మ త్రిపురాన్ని.

"వెళుతున్నాను."

"మేం వచ్చాంగా ఇవాళ మానేస్తే ఏం పోయింది?" చిరుకోపంతో అడిగింది సునీత చెల్లెలుని.

"ఇంకేమయినా ఉందా? ఇవాళ లిటరేచర్ లో ఇంపార్టెంట్ క్లాసు ఉంది."

"ఏ గ్రూప్ తీసుకున్నావ్?" అడిగాడు సునీత మొగుడు.

"ఇంగ్లీష్ లిటరేచర్."

"నా గ్రూపే అన్నమాట"

"త్వరగా అన్నం పెట్టమ్మా. టైమవుతోంది" అన్నది త్రిపురం వంట గదిలోకి వెళుతూ.

పదినిమిషాలలో భోజనం ముగించి బయలుదేరింది త్రిపురం కాలేజీకి.

"అదేమిటమ్మా? ఇంత చిక్కిపోయింది త్రిపురం?" ఆశ్చర్యగా అడిగింది సునీత వర్ధనమ్మని మధ్యాహ్నం.

"ఏం చేయను? దానికి కాలేజీ, చదువుతప్ప వేరే ధ్యాసలేదు. సరిగ్గా తినదు. ఇరవైనాలుగ్గంటలూ పుస్తకాలే."

"స్కాలర్ షిప్ రావాలనా?"

"గోల్డ్ మెడల్ కోసం."

"ఫైనలియర్ కదూ?" అడిగాడు భార్యని జయరాం.

"అవును. ఇంకో నాలుగునెలల్లో పరీక్షలు మొదలవుతాయి, పరీక్షలు దగ్గరయ్యేకొద్దీ భయం ఎక్కువవుతుంటుంది దానికి. సమయానికి గుర్తు చేసి కాఫీ,టిఫిన్ భోజనం పెట్టాలి. లేకపోతే అడగదు. దానికసలు ఆకలి వేయదేమో అనిపిస్తుంది చూస్తుంటే."

సునీత భర్త మర్నాడు ఉదయం వెళ్ళిపోయాడు.

వారం రోజులు చెల్లెలి ధోరణి చూసి ఎనిమిదో రోజు కోప్పడింది సునీత.

"మరీ చిన్నపిల్లలా ఏమిటే అది? తిండి, నీళ్ళు కూడా మర్చిపోయి ఏమిటా చదువు? మేమంతా చదువుకోలేదా? నీలాగేనా చదివింది."

"బి.ఏ.లో క్లాస్ రావటం ఎంత కష్టమో తెలుసుకదా నీకు. అందులో గోల్డ్‌మెడల్ రావాలంటే ఇంకా కష్టం."

"ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలి. లేకపోతే ఈ వయసులో ఏం తెలియదు కాని ముందు ముందు చాలా ఇబ్బందుల పాలవుతావు"

"అబ్బో! పెద్దరికం లేదు. ఏంలేదు. జరగబోయేది చెపుతున్నాను. సాయంత్రం ఆస్పత్రికి వెళ్ళి డాక్టర్‌కి చూపించాలి. తోడు వస్తావా? చదువుకోవాలంటావా?"

"వస్తానుకాని బాబుని ఎత్తుకోమంటే మాత్రం కుదరదమ్మాయ్. ముందే చెప్పేస్తున్నాను."

"ఏం? రేపు నీకు పెళ్ళయితేమెయ్యవూ? ఇప్పట్నించే అలవాటు చేసుకోవటం మంచిది తెలుసా?"

"చస్తే పెళ్ళి చేసుకోనునేను."

"చేసుకోక?"

"చదువుకుంటాను."

"ఎంతదాకా?"

"చివరిదాకా."

"ఆల్ రైట్. గొంతుదాకా. ఆ తర్వాత?"

"ఉద్యోగం చేస్తాను."

"ఎంతదాకా?"

"అంటే?"

"చచ్చేదాకా పెళ్ళి మానేసి ఉద్యోగం చేసుకుంటూ బ్రతుకుతావా?"

"యస్"

"అమ్మా! ఇలా అయితే దీనికసలు చదువే వద్దు. కాలేజీ మానిపించేసెయ్" అన్నది సునీత నవ్వుతూ.

"నెవర్. నా చేత చదువు ఎవరూ మానిపించలేదు. 'త్రిపురం ఎం.ఏ.ఎం.లిట్., పి.హెచ్.డి' అనిపించుకునే దాకా మానను."

సాయంత్రం హాస్పిటల్‌కి వెళ్ళారు ఇద్దరూ బాబుతో. ఇదివరకు సునీతకు పురుడుపోసిన డాక్టరే ఆవిడ. పలకరించింది ఇద్దరినీ గుర్తుపట్టి.

ఇదివరలో తను వాడిన మందుల తాలూకు ప్రిస్క్రిప్షన్స్ చూపించింది సునీత లేడీ డాక్టర్‌కి. ఆవిడ ఓ పావుగంటసేపు పరీక్ష చేసింది కొని మందులు వ్రాసిచ్చింది. సినిమా చూసి ఇంటికి చేరుకున్నారు రాత్రి పదిన్నరకి ఆటోలో.

***

త్రిపురం ఏకాగ్రత చూసి ఆశ్చర్యపోయింది సునీత. ఏవో టెక్టు బుక్స్ చదువుకోవడం, నోట్స్‌లు తయారు చేసుకోవటం, రాత్రిళ్ళు చాలాసేపు మేలుకుని రాసుకోవటం.

"ఇంక చాల్లే పడుకో. చూస్తుంటే నాకే విసుగొస్తోంది" అనేది ఒకోసారి అర్ధరాత్రి బాబు ఏడ్చి మెలుకువ వస్తే.

క్రమంగా నెలలు నిండాయి సునీతకి. త్రిపురం పరీక్షలు కూడా దగ్గరయాయి. కాలేజీ నుంచి వస్తూ అక్కయ్యకి కావల్సిన మందులు తీసుకు వస్తుంది. కాఫీ తాగి కాసేపు ఏదైనా ఇంగ్లీష్ నవల చదువుతుంది. ఆ తర్వాత మళ్ళా తన చదువులో మునిగిపోతుంది.

"బాబేడుస్తున్నాడే కాసేపు వాడిని ఆడించరాదా?" అంటే విసుక్కుంటుంది.

"అలా కాసేపు బయటికి వెళ్ళొద్దాం. రారాదా!" అంటే మొహం అయిష్టంగా పెడుతుంది.

వర్ధనమ్మే ఆస్పత్రికి వెళ్ళటం, బజారుపనులు చూసుకోవడం, ఇంటిపనులు చేసుకోవడం మొదలయిన వాటితో సతమతమవుతుంది.

"ప్చ్! నేనయితేనా? ఊరుకునేదాన్ని కాదు. ఆడపిల్లన్న తర్వాత పనీ, పాట చేస్తుండాలి" అంటుంది సునీత.

"నీకనవసరం. వచ్చినపని చూసుకుని వెళ్ళు" కసురుతుంది త్రిపురం.

నెలలు నిడాయి. లేడీ డాక్టర్ పరీక్ష చేసి చెప్పింది

"ఆస్పత్రిలో ఎడ్మిట్ అవటం మంచిది. కానుపు కష్టం అవచ్చు."

ఆ రోజు సాయంత్రమే ఆస్పత్రిలో చేరింది సునీత.

వర్ధనమ్మ నిజంగా భయపడింది. మానసికంగా ఆవిడ కూతురు గురించి ఆందోళన పడసాగింది. సునీత కడుపు చూస్తే దిష్టి తగిలేలా ఉంది. ఆయుధాలు లేకుండా కానుపు అవదేమోనన్న భయం ఒక ప్రక్క, తనకి అండగా ఎవరూ లేరన్న దిగులు మరో ప్రక్క ఆవిడని బాధించసాగాయి.

త్రిపురం మాత్రం ఇంటిగొడవలేమీ పట్టించుకోకుండా తన చదువులో లీనమైపోయింది. తల్లిసహాయం చేయమని అడిగినా విసుక్కుంటూ చేసేది కాదనలేక. కూతురి అయిష్టాన్ని గ్రహించి ఆవిడ వీలైనంతవరకు పనులు చెప్పకుండా తనే చేసుకుపోయేది.

రాత్రిళ్ళు ఆస్పత్రిలో తోడు పడుకుని, ఉదయం లేచి ఇంటికి వచ్చి, కాఫీ కలిపి ఫ్లాస్క్‌లో పోసి, మళ్ళీ ఆస్పత్రికి వెళ్ళేది కాఫీతో, బాబుకి పాలతో. కొత్తకాబట్టి వాడు తల్లిని వదిలి రాడు.

వారం రోజులదాకా కానుపు రాలేదు. వారం రోజులూ ఆస్పత్రికీ, ఇంటికీ, ఇంటికీ, ఆస్పత్రికి తిరుగుతూనే ఉంది వర్ధనమ్మ.

"మొద్దు రాచ్చిప్పలా పూచిక పుల్లకూడా ముట్టకుండా పుస్తకాలు ముందేసుకుని కూర్చుంది అది. నీ అలుసు చూసుకునే అలా ప్రవర్తిస్తోంది" అని గయ్‌మని తల్లిమీదకు లేస్తుంది సునీత, ఆవిడ అవస్థ చూడలేక.

"పోన్లేవే. దానిదదో లోకం..." అంటుందావిడ.

"అలా సమర్ధించబట్టే ఇలా తయారైంది."

ఆస్పత్రిలో చేరిన ఎనిమిదవరోజు రాత్రి నొప్పులు ఆరంభం అయ్యాయి. డాక్టర్ రాసిచ్చిన మందులు అప్పటికప్పుడు తీసుకువచ్చింది ఆవిడ.

తెల్లవారుఝామున పురుడు వచ్చింది. ఆడపిల్లలు పుట్టారు. కవల పిల్లలు.

## 4

రెండు రోజుల తర్వాత వచ్చింది త్రిపురం, అక్కయ్యని, పిలల్ని చూడటానికి.

"బలే ఉన్నారే! అబ్బ ఒకేలా ఉన్నారు ఇద్దరూ. కంగ్రాచ్యులేషన్స్. పేపర్‌లో వేయించనా వీళ్ళ ఫోటోలు?"

ఎంతో ఆప్యాయంగా వచ్చిన త్రిపురాన్ని ఏం అనలేకపోయింది సునీత.

"చాలా బావున్నారే. బావగారు వచ్చేస్తారుగా రేపు. కావాలంటే ఆయన్నే అడుగు."

సునీత తృప్తిగా నిట్టూర్చింది. మర్నాడు జయరామ్ వచ్చాడు. సిగ్గుతో కళ్ళు మూసుకుంది సునీత ఆయన్ని చూసి.

"డామిట్. ఇంతపని చేస్తావని తెలిస్తే మనవూళ్ళోనే పురుడుపోయించేవాణ్ణి. అక్కడయితే ఇలా జరిగుండేది కాదు. అవునా?"

సునీత చిరునవ్వు నవ్వింది.

"ఆడపిల్లల్ని కన్నావా? కనీసం లవకుశుల్లా మగవాళ్ళయినా బావుండేది."

మళ్ళీ నవ్వింది సునీత.

"పోన్లే.. ఇంక వాళ్ళతో అంతా చిక్కే. ఇద్దరికీ సరిపోయే పేర్లు వెదకడంతో ప్రారంభం నా బాధలు."

"ఎన్ని రోజులు శెలవు పెట్టారు.?"

"వారం. మూడు రోజులే శెలవు గ్రాంట్ చేస్తారు పెళ్ళాం పురిటికి, కవల పిల్లలు కాబట్టి వారం ఇచ్చారు."

"పదకొండోరోజు చేయద్దు నామకరణం, మూడోనెల చేద్దాం మంచి పేర్లు ఆలోచించి."

"అలాగే"

"డాక్టర్ ఇందాక ఓ మాట అన్నారు."

"ఏమన్నారు?"

"ముగ్గురున్నారు కాబట్టి ఆపరేషన్ చేయించుకోమని."

"వాళ్ళు అలాగే అంటారు. ఈసారి చూద్దాంలే. వీళ్ళకి ఏం కొనాలన్నా...."

"కాదు. ఈసారి కూడా మళ్ళీ కవలపిల్లలు పుడితే కష్టం. మీరు చేయించుకుంటారా?"

"ఆలోచిద్దాం."

"నేను చేయించుకునే పక్షంలో వెంటనే చేయించుకోవటం మంచిదట."

"నువ్వేమమంటావ్? నాకు శెలవు లేదుగా?"

"అందుకే నేను చేయించుకుంటాను."

కొద్దిక్షణాలు మౌనంగా ఉండిపోయాడు జయరామ్. తర్వాత అన్నాడు.

"ఆల్‌రైట్ డాక్టర్‌తో మాట్లాడతాను ఇదీ ఒకందుకు మంచిదే"

"ఇద్దరికీ రెండు గౌన్లు కొనుక్కురండి. ఒకే రకంవిగా ఉండాలి."

"రెండు పౌడరు డబ్బాలు, రెండు.."

సునీత పకపకా నవ్వడంతో ఆపేశాడు.

✷✷✷

సునీత చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రతిదీ కష్టమే. అంతా ఇరకాటంగా ఉంది.

కవలపిల్లలిద్దరూ ఒకేలా ఉన్నారు చూపులకి. ఒక పిల్లకి స్నానం చేయించిన వెంటనే ఇంకో పిల్లకు చేయించకుండా మధ్యలో ఏదో పని పెట్టుకుంటే తర్వాత ఎవరికి స్నానం చేయించిందో, ఎవరికి చేయించాలో గుర్తుండేదికాదు.

ఏడుస్తుంటే ఒక పిల్లకి పాలు పట్టేది. కాసేపయాక మళ్ళీ ఇద్దరూ ఏడుస్తుంటే, ఎవరికి పాలు పట్టిందో ఎవరికి పాలు పట్టలేదో తేలేసేది కాదు.

దానికితోడు ఇద్దరి బట్టలూ ఒకేలా ఉండటంతో గుర్తుంచుకోవడం సాధ్యమయేది కాదు. వాళ్ళిదరితో మొదటివారం రోజులూ ఇలాంటి చిన్న చిన్న ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది.

ఒక పిల్లకి నుదుటున, ఒక పిల్లకి బుగ్గన బొట్టుపెట్టి గుర్తుంచుకోడానికి ప్రయతించింది. కాని బుగ్గన బొట్టున పిల్లకి పాలు పట్టిందో లేక నుదుట బొట్టున పిల్లకి పాలు పట్టందో గుర్తుండేదికాదు.

"దీనికి బుగ్గన బొట్టుంది. దీనికే స్నానం చేయించాను ఇందాక" అని సునీత అంటే,

"కాదు స్నానం అయాక నేనే నుదుట బొట్టు పెట్టాను" అనేది వర్ధనమ్మ.

చివరికి వర్ధనమ్మే ఓ ఉపాయం చెప్పింది కూతురికి.

"ఓ పిల్ల చేతికి నల్లదారం కట్టు, ఏ పని చేసినా ముందా నల్లదారం ఉన్న పిల్లతో ప్రారంభించు."

సునీత మొగుడు వెళ్ళిపోయాడు, భార్యకి ఆపరేషన్ సవ్యంగా అవగానే.

త్రిపురం విసుక్కునేది. పరీక్షలు దగ్గరపడ్డాయి. వర్ధనమ్మకి టైంకి అన్నం వండిపెట్టేందుకు తీరుబడి ఉండేది కాదు. ఆవిడకి చేతినిండా పని.

ఇంట్లో చదువుకోడానికి అసలు కుదిరేదికాదు. ఒక పక్క బాబు ఏడుపు. ఇంకో పక్క కవల పిల్లల ఏడుపు. పరీక్షలు ఇంకా వారం రోజులున్నాయనగా త్రిపుర మకాం తన స్నేహితురాలింటికి మార్చేసింది. రోజూ సాయంత్రం ఓ గంట వచ్చి ఇంట్లో కూర్చుని, తల్లి ఇచ్చిన కాఫీ తాగి వెళ్ళిపోయేది.

పరీక్షలు అయాక వచ్చింది మళ్ళీ.

"ఏం తల్లీ? ఎలా రాసావ్ పరీక్షలు?" అడిగింది సునీత.

"కొద్ది నెలలు ఓపిక పట్టు. రిజల్ట్ వస్తుందిగా."

"గోల్డ్ మెడల్ రాకపోతే తప్పు నా కూతుళ్ళ మీదకి నెడతావా?"

"వాళ్ళు కూతుళ్ళా? రాక్షసులు."

"ఛీ! ఏమిటా పాడు మాటలు?"

"నీ కున్నంత ఓపిక నాకు లేదు. నేనయితే నాలుగు బాదేదాన్ని ఏడ్చినప్పుడల్లా"

"మంచిదానివే అయితే"

"నాకో అనుమానం."

"సిల్లీ అనుమానాలయితే అడగక."

"రేపు పెద్దవాళ్ళయాక వీళ్ళకి పెళ్ళిళ్ళు చేయాలి కదా?"

"అవును."

"అప్పుడు ఆ పెళ్ళికొడుకులిద్దరూ కూడా కవల పిల్లలై ఉండాలి కదా?"

"అలా అని నియమం ఉందా ఏమిటి?"

"కవల పిల్లలకి కవల పిల్లల్నిచ్చే చెయ్యాలి. ఒకే పందిట్లో ఒకే ముహూర్తానికి."

"ఇరవై ఏళ్ళనాటి మాటకదా."

"అలా అని ఊరుకోకూడదు. ఇప్పుడే పేపర్లో మనకి ఆడ కవల పిల్లలు ఉన్నారని ప్రకటించామనుకో - గత నాలుగైదు సంవత్సరాల్లో మొగ కవల పిల్లలు కన్నవారు వెంటనే తమ చిరునామాని మనకి తెలియపరచమని కోరామనుకో, అలాంటి వారుంటే, మనల్ని కాంటాక్ట్ చేస్తే, అన్నీ కుదిరితే సగం బాధ తగ్గిపోయినట్లేగా? ఎలా ఉంది ఐడియా?"

"మీ బావ వచ్చాక ఆయనకి చెప్పు ఈ సలహా.

✷✷✷

*(ఇంకావుంది)*




ఈ నవల క్రిందటి భాగం ఇంకా చదవలేదా..? లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా? వెంటనే కౌముది గ్రంధాలయాన్ని సందర్శించండి..

**Click here to go to KOUMUDI Library**